క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ప్రకాష్

ఇచ్ఛాపురం రూరల్: రానున్న కాలంలో రైతులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయంపై ఆధారపడి పంటలు సాగుచేస్తారని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రకాష్ అన్నారు. మశాఖపురం గ్రామంలో రైతులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పీఎండీఎస్ వలన జీవ వైవిధ్యం పెరుగుతోందన్నారు. భూమి సారవంతంగా మారి పంటలకు కావలసిన అన్ని పోషకాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, సీఆర్పీ జాడు తులసయ్య, ఐసీఆర్పీ నాగమణి, రూప పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సొండిపూడిలో భవనాలను పరిశీలిస్తున్న అధికారులు

మందస: అభివృద్ధి పనులు శరవేగంగా జరగాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు అన్నారు. సొండిపూడి, భైరిసారంగపురం, మందస, బాలిగాం తదితర పంచాయతీల్లో జరుగుతున్న పనులను శనివారం పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలోగా పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని కోరారు. సర్పంచ్ చిచ్చుల నళిని, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీనివాసరావు, దడ్డ కిరణ్‌కుమార్, పోలం శ్రీను, మల్లారెడ్డి జగన్ ఉన్నారు.

ఘనంగా చక్రధరస్వామి వైశాఖహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధరస్వామికి వైశాఖహోమం ఉత్సవం శనివారం నేత్రపర్వంగా జరిగింది. లోకకల్యాణార్థం రైతులు, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, సస్యశ్యామలంగా పాడిపంటలతో సమాజ క్షేమాన్ని కోరుతూ వైశాఖమాసం చివరి శనివారం ఈ హోమాన్ని భక్తిశ్రద్ధలతో చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అనువంశికధర్మకర్తలు పి.కృష్ణారావు, పి.శ్రీరాంబాబు, పి.అనసూయమ్మల ఆధ్వర్యంలో ఒడిశాకు చెందిన వేద పండితులచే హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు వేకువజామున శ్రీదేవీ, భూదేవీసమేత చక్రధరపెరుమాళ్లస్వామికి సుప్రభాతసేవ, నిత్యదర్శనాలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైశాఖ హోమం పూర్ణాహుతి ప్రసాదాన్ని భక్తులకు అందించారు.

ఉల్లాసంగా వేసవి విజ్ఞాన శిబిరం



టెక్కలి: పరుగు పోటీలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

టెక్కలి: గ్రంథాయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. ఒక వైపు విజ్ఞాన కార్యక్రమాలు.. మరో వైపు ఆటలతో విద్యార్థిని, విద్యార్థులంగా ఉల్లాసంగా గడుపుతున్నారు. టెక్కలి గ్రంథాలయంలో శనివారం పరుగు పందాలు నిర్వహించారు. ఆర్మీ ఉద్యోగి బి.రాజు, పీఈటీ జయకుమార్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



భక్తులచే పూజలందుకుంటున్న హనుమంతుడు

కంచిలి: మండలంలోని ఎక్కల పంచాయతీ పరిధి అర్జునాపురం గ్రామంలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంక్షేమ పథకాలకు అర్హతే కొలమానం

- ఇనాం భూముల సమస్యను పరిష్కరిస్తాం
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- పూడి జగన్నాథపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు అర్హతే కొలమానమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గత ప్రభుత్వానికి.. ప్రస్తుత ప్రభుత్వానికి తేడా గమనించాలని ప్రజలను కోరారు. పూడి జగన్నాథపురం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సర్పంచ్ బత్తిని ప్రసాదరావు అధ్యక్షన శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కావాలంటే పసుపు చొక్కాలు, చీరలు, జెండాలు పట్టుకున్నవారికే ఇచ్చేవారన్నారు. జన్మభూమి కమిటీలు దండుకుని సంక్షేమ పథకాలను అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పిల్లల చదువుల కోసం ఏ ప్రభుత్వమూ చేయనంత ఖర్చు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. పూడి జగన్నాథపురంలో గ్రామంలో 50 ఏళ్లకు పైబడి ఉన్న ఇనాం భూముల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ భూములకు హక్కులు కల్పించే దిశగా రీ సర్వేలో రైతులందరికీ శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. పంచాయతీలోని పూడిలంక గ్రామానికి ఉప్పుటేరుపై సగంలో ఆగిపోయిన రహదారి నిర్మాణానికి త్వరలోనే అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జూన్ నెలలో కిడ్నీ రోగులకు వరంలా నిర్మిస్తున్న రీసెర్చ్ సెంటర్‌ను సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ బ్రహ్మాండమైన సంబరంలో మీరంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని కాంతారావు, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, తహసీల్దార్ బి.అప్పలస్వామి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కారి వెంకటరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు దున్న బాలరాజు, ఎం.భాస్కరరావు, బత్సల ధర్మారావు, చింత హేమారావు, గ్రామ పెద్దలు దుమ్ము రామ్మూర్తి, జోగారావు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, వాలంటీర్‌లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న పిరియా విజయ, కిల్లి కృపారాణి

సోంపేట: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీ రెండో సచివాలయం పరిధిలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణితో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించారు అలాగే రేషన్‌కార్డు వారీగా చేకూరిన లబ్ధిని తెలియజేసి బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయ, కృపారాణి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 98 శాతం నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. చిత్తశుద్ధితో పరిపాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉపసర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్, నాయకులు తోట ఢిల్లీరావు, బీన ఢిల్లీరావు, నెహ్రూ, పలువురు సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 372 కేసుల పరిష్కారం



టెక్కలి: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



సోంపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో రాజీమార్గం ద్వారా 372 కేసులను పరిష్కరించడం ద్వారా రూ.28 లక్షల మేరకు వివిధ రకాల పరిహారం, సెటిల్‌మెంట్లు చేసినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి డి.భరణి నేతృత్వంలో రెండు బెంచ్‌ల ద్వారా నిర్వహించిన లోక్ అదాలత్‌లో భాగంగా రెండు సివిల్ కేసుల్లో రూ.15 లక్షలు సెటిల్‌మెంట్ చేశారు. అలాగే ఒక ప్రీ లిటిగేషన్ కేసులో శాశ్వత మనోవర్తి కింద రూ. పది లక్షలు పరిహారం వచ్చే విధంగా సమస్యను పరిష్కరించారు. వీటితో పాటు కాంపోండ్‌బుల్ క్రిమినల్ కేసులు 16, మనోవర్తి కేసులు 2, కాంపోండ్‌బుల్ అడ్మిషన్ కేసులు 76తో పాటు సమరీ ట్రైల్ కేసులు 274 పరిష్కరించి రూ.3 లక్షలు ఫైన్ వేశారు. మొత్తం 372 కేసులను పరిష్కరించి తద్వారా రూ.28 లక్షల మేరకు వివిధ రకాల పరిహారం, సెటిల్‌మెంట్ చేసినట్లు కోర్టు సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానందా, న్యాయవాదులు కె.వెంకట్రావు, ఎస్.ఎస్.రాజు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో 420 కేసులు..

కోటబొమ్మాళి: స్థానిక కోర్టు సముదాయంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 420 కేసులు పరిష్కారమైనట్లు శ్రీకాకుళం ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ (కోటబొమ్మాళి కోర్టు ఇన్‌చార్జి జడ్జి) భరణి తెలిపారు. పరిష్కారమైన వాటిలో 75 క్రిమినల్, 343 పెట్టీ, రెండు సివిల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండో తరగతి మేజిస్ట్రేట్ సీపాన భాస్కరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నరసింహమూర్తి, న్యాయవాదులు వి.అప్పలనాయుడు, ఎల్.గోవిందరావు, ఎస్.శ్రీధర్‌రాజు, కె.వెంకటరావు ఉన్నారు.

సోంపేటలో 526..

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 526 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్ కుమార్‌తో కలిసి అదాలత్ నిర్వహించారు. న్యాయవాదులు కె.గోవిందరావు. ఎస్.జ్ఞానానంద్ బెనర్జీ పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

నరసన్నపేట: మండలంలోని చోడవరంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అడపా చంద్రశేఖర్ శనివారం తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోహన్‌బాబు చారటబుల్ ట్రస్టు సహకారంతో ఈ నేత్ర చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి శుక్లాలు తొలగించే శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. జెమ్స్ ఆస్పత్రి వారితో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని, స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కలప అక్రమ రవాణా!



వాహనాల ద్వారా డిపోలకు తరలిపోతున్న కలప

ఆమదాలవలస రూరల్: మండలంలో కలప రవాణా అక్రమంగా సాగుతోంది. కలపను టింబర్ డిపోలకు తరలించాలంటే అటవీ, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా వాహనాల ద్వారా డిపోలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. టింబర్ డిపోలకు చెందిన యజమానులు గ్రామాల్లో తక్కువ ధరకు కలపను కొనుగోలు చేసి వాటికి ఎటువంటి పన్నులు చెల్లించకుండానే ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ తరలించడం చర్చంశనీయంగా మారుతుంది. గ్రామాల్లో చిన్నపాటి అవసరాల కోసం కలపను వ్యాన్‌ల ద్వారా తరలిస్తే వాటిని అటవీశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా డిపోలకు తరలిస్తున్న కలపను అధికారులు ఎందుకు సీజ్ చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమ కలప రవాణాతోపాటు గ్రామాల్లో ప్రభుత్వ రోడ్డుకు అనుకుని ఉన్న స్థలాల్లో ఉన్న చెట్లను సైతం యంత్రాల ద్వారా ముక్కలు చేసి వాటిని డిపోలకు తరలించుకుపోతున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న అక్రమ కలపను పట్టుకోవాలంటే పట్టణాల్లో ఉన్న డిపోలపై అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహిస్తే బయటపడుతుందని గ్రామాల్లోని ప్రజలు చెబుతున్నారు. నాగావళి నదీ పరివాహక ప్రాంతమైన ముద్దాడపేట, కొత్తవలస, నిమ్మతొర్లాడ, కొరపాం, దూసి పరిసర ప్రాంతాల్లో నదీ తీరంలో ఉన్న చెట్లను కొందరు అక్రమంగా నరికివేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. నదీతీరంలో ఉన్న చెట్లు నరికివేయడం వల్ల వర్షాకాలంలో వచ్చే వరదలు గ్రామాల్లోకి వస్తాయని గ్రామస్తులు చెబుతున్నారు. వరదలు గ్రామాల్లోకి రాకుండా చెట్లు కొంత వరకు రక్షణగా ఉంటున్నా వాటిని ఇటుక బట్టీల కోసం నరికివేస్తున్నారని చెబుతున్నారు. వీటిపై రెవిన్యూ అధికారులు దృష్టి సారించి, చెట్లు నరికివేయకుండా తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు కోదండరావు ఎంపిక



టెంక కోదండరావు

మందస: జిల్లా వన్‌డే క్రికెట్ జట్టుకు మూలిపాడు పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన టెంక కోదండరావు ఎంపికయ్యారు. ఈయన 'సాక్షి' దినపత్రిక నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రెండుసార్లు కెప్టెన్‌గా రాష్ట్రస్థాయి కప్ సాధించారు. తెలంగాణాలోని ఎస్ఆర్ఎం అకాడమీ, శ్రీకాకుళంలో ఎస్ఎస్ఆర్ అకాడమీలలో శిక్షణ పొందుతున్నారు. ఈస్ట్‌గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు కలిపి నార్త్‌జోన్‌గా వన్‌డే మ్యాచ్‌లు జరగనున్నాయి. ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నట్టు కోదండరావు చెప్పారు. సర్పంచ్ గుసిరి వెంకటరావు, ఉప సర్పంచ్ రామచంద్రచౌదరి, మాజీ సర్పంచ్ గొరహరో మహంతి తదితరులు కోదండరావును శనివారం అభినందించారు.

మహాయజ్ఞంలో జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు

కవిటి: కుసుంపురం గ్రామంలో లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న హరేరామ హరేకృష్ణ తారకనామమంత్ర మహాయజ్ఞం శనివారం నుంచి వైభవంగా ప్రారంభమైంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పీవో హైమావతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హరిశ్చంద్రపురం-2,(బీసీ-ఈ మహిళ), జలుమురు మండలం తిమడాం-2 (బీసీ-ఏ మహిళ) కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.. అభ్యర్థులు 8వ తరగతి పాసై 21-35 ఏళ్ల వయసు గల మహిళలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి: టెక్కలి ఆదిఆంధ్రావీధిలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదివారం నిర్వాహణ పనులు చేపట్టనున్నారు. దీంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని..వినియోగదారులు సహకరించాలని కోరారు.

కర్ణాటకలో కాంగ్రెస్ విజయంపై హర్షం

టెక్కలి: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ఆ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధికార ప్రతినిధి పి.పరమేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ కోఆర్డినేటర్ కె.మధుసూదనరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని.. దీనికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ పాలనతో ప్రజలు విసిగిపోతున్నారన్నారు.

తాత్సారం లేకుండా లబ్ధిదారుల ఎంపిక

- ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తిస్తే చర్యలు
- టెక్కలి మండల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు వాణి



సమావేశం వేదికపై జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి, ఎంపీపీ సరోజనమ్మ తదితరులు

టెక్కలి: ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి అన్నారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో తాత్సారం ప్రదర్శించి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా వ్యవహరిస్తే అటువంటి అధికారులపై చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అట్ల సరోజనమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల పరిష్కారం విషయంలో కొంతమంది సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, అలాగే ప్రభుత్వం అందజేస్తున్న ఇళ్ల స్థలాలకు ఎల్‌పీసీలు ఇచ్చేందుకు రెవెన్యూ సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని, మ్యుటేషన్‌కు లంచాలు అడుగుతున్నారంటూ పలువురు సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా జలజీవన్ మిషన్ పథకం పనులపై అధికారులు కనీసం పర్యవేక్షణ చేయడం లేదన్నారు. అనంతరం జెడ్పీటీసీ దువ్వాడ వాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అలాగే అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్నారని, క్షేత్ర స్థాయిలో ఎవరైనా తాత్సారం చేస్తే అటువంటి అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మిగిలిన ప్రాంతాల్లో జల జీవన్ మిషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని టెక్కలి మండలం ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలన్నారు. ఎంపీపీ అట్ల సరోజనమ్మ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించే విధంగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, ప్రత్యేక ఆహ్వానితుడు ఎస్.శంకర్, ఎంపీడీవో ఉమా సుందరి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ దువ్వాడ



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సంతబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం, అర్థికాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. వడ్డితాంధ్ర గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజాసంక్షేమం కోసం పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, నాయకులు మేరుగు అప్పారావు, నక్క భీమారావు, పొందల రామకృష్ణ, కోత సతీష్, కోత ఇందిర, మండల జేసీఎస్ కన్వీనర్ మోడీ భాస్కరరెడ్డి, ఎన్ని మన్మథరావు, హన్నురావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు అదరహో..



అలరిస్తున్న జబర్దస్త్ కామెడీ



అమ్మవారికి పూజలు చేస్తున్న కృపారాణి, పిరియా విజయ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి జబర్దస్త్, ఢీ టీమ్ కళాకారులు తమ ప్రదర్శనలతో సందడి చేశారు. బుల్లెట్ భాస్కర్, సునామి సుధాకర్, శాంతిస్వరూప్, పొట్టినరేష్‌ల కామెడీ, పల్సర్ బైక్ ఝాన్సీ, ఢీ బృందం సభ్యులు కుమార్ డాన్స్ బృందం నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అమ్మవారికి కృపారాణి పూజలు

స్వేచ్ఛావతి అమ్మవారిని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కృపారాణిని సత్కరించారు.

మూలకు చేరిన వాహనాలు



నిరుపయోగంగా ఉన్న ద్విచక్ర వాహనాలు

టెక్కలి రూరల్: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో పోలీసు శాఖ వినూత్నతనంగా చేపట్టిన బ్లూకోట్స్ పథకం ద్వారా కొనుగోలు చేసిన వాహనాలు నిరుపయోగంగా మారాయి. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన రెండు బ్లూకోట్స్ వాహనాలు, ఒక డయల్ 100 వాహనం దేనికీ పనికిరాకుండా పోయాయి. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. సుమారు ఏడాదిన్నార క్రితం కొనుగోలు చేశారు.

రిజర్వేషన్లు ఎత్తివేతకు కుట్ర

టెక్కలి: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నియంత పాలన చేస్తూ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మోదీ హింసా రాజకీయాలకు చెక్ పెట్టేందుకు ఆరంభమన్నారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన రెజ్లర్లు న్యాయం కోసం నిరసన చేస్తుంటే వారిపై విరుచుకుపడిన మోదీపాలనకు అంతం ఆరంభమైందన్నారు.

సమతా సమ్మేళన్ విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమరసత వేదిక ప్రతినిధులు

నరసన్నపేట: జిల్లా కేంద్రంలో జూన్ 25న నిర్వహించనున్న సమతా సమ్మేళన్ కార్యక్రమం విజయవంతం చేయాలని స్థానిక సామాజిక సమరత వేదిక రాష్ట్ర శాఖ ప్రతినిధి పెంటా ఆటకేశం కోరారు. ఈ మేరకు శనివారం ఈ కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను నరసన్నపేటలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన బలహీన వర్గాలకు, నిమ్న జాతులకు అందించిన సేవలను గుర్తు చేస్తూ ఈ కార్యక్రమం 25న నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర స్థాయి ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. స్థానిక అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, ప్రతినిధులు చింతు రామారావు, కె.ఎల్.ఎన్.మూర్తి, పి.తవిటినాయుడు, వెంకటరమణ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.